


# 13 చిలక చెప్పిన రహస్యం కథ

"రా సుబ్బరాజు రా. నీ కోసమే జూస్తున్నా. రాత్తిర్నివ్వేళ్ళాక చౌదరిగారి మనిషొచ్చాడు. నువ్వూ నేనూ కతలు చెప్పకుంటున్నాము కదూ. వాళ్ళకేం దెలుసుద్దీ? రెడ్డిగారింకా కదిల్రాలేదు. ఒచ్చేట్టా, మానేట్టా? సుబ్బరాజేం చేస్తున్నాడు? ఈళ్లిద్దరూ కుమ్మక్కవ్వడం లేదు గదా?" అని వాకబు చేసుకుందుగ్గావాల అన్నాడు రామిరెడ్డిగారు.

"నిజమేగా" అన్నాడు సుబ్బరాజు గంభీరంగా నవ్వి.

"నీ యసాజ్జం గూలా. బినామీ పన్జేసినా పబ్లీగ్గా చేస్తానంటావు. దర్జా ఎక్కడికిపోద్ది. ఈపాటి ధయిర్యం చిలకల చిన్నారావుకుంటే బాగుపడేవాడు. ఆ కథ మా చిత్రమైందిలే. చిన్నారావు, బుచ్చిరెడ్డీ చిన్నపట్నుంచీ జాయింటే. రెడ్డి గడ్డి తినమంటే తినేసేవాడు చిన్నారావు. ఏమనమంటే అదనేవాడు. దాన్నిబట్టే చిలకల చిన్నారావని పేరెట్టారు. అసలింటి పేరు నాకు గుర్తు లేదు. లోగుట్టెరిగిన వాళ్ళు రెడ్డి, వీడు నమ్మినబంట్లనే వారుగాని ఊళ్ళో జనమంతా తోడు దొంగలనే పిల్చుకునేవారు. తోడు దొంగలైతే మరి చిన్నారావు కూడా మూడు మేడల్లేపాలి గదా రెడ్డితోపాటు? అదిగో ఆ పాయింటునే బట్టుకొని, రెడ్డికి చుక్కెదురైన గ్రూపు నాయకుడు పంతులు చిన్నారావును దువ్వడం మొదలుపెట్టాడు. చిన్నారావు కాపాటి విలువుందా అనేవు. అతను రెడ్డిగారికి బొజ్జింక మీసం లాంటివాడు. చెప్పుల్జతలాటివాడు. గొడుగు లాటివాడు. చేతికర్ర లాటివాడు. లవుడు స్పీకరులాటివాడు. హుండీలు జారీజేసి ఏ పసుపో, పంచదారో, కాయితమో, కాకరకాయో – మార్కెట్‌లో ఉన్న సరుకంతా కొనేసి గోదావుల్లో బిగించి ఒక్క వారంపాటు బ్లాకు మార్కెట్ నడిపి డబ్బు నొల్లుకో బోయినప్పుడల్లా ఆపదొస్తే అడ్డుపడి ఖైదుకెళ్ళొచ్చేది చిన్నారావే. ఆ కాసిన్నాళ్ళూ రెడ్డిగారి హృదయం, ఖైదులోని చిన్నారావు దేహంలోకి పరకాయ ప్రవేశం చేసి ప్రాయశ్చిత్తం చేసుకొనేది. ఇటు అసలు దేహం – దాని చుట్టూ వెధవ పరువు ప్రతిష్టల్లాంటివి నాచులా బట్టుకున్నాయి గాబట్టీ, బిజినెస్సెవారాల్లోకి నిజాయితీ ఉన్న శాల్తీగావాలి కాబట్టీ, తన సొంత దేహాన్ని ఖైదు కెళ్ళకుండా అట్టేబెట్టేవాడు. చిన్నారావు బస చేసిన దేహాన్ని ఖైదు కంపితే, ఇటూ తన బసని ఏ దేవుడి గుడికో తీసుకెళ్ళి దాన్చేత స్పెషలు పూజలూ, గట్రా చేయించి, దండాలు

బెట్టించి సుబ్బరం జేసేవాడు. అసలదీగాక చిన్నారావు శాస్త్రీలా తనది గట్టిది కాదు. ఎప్పుడూ రిపేర్లే. సూదులు పొడవడం, కోతలు కోయించి మాసికలు బెట్టించడం, మందులు దిమ్మరించడం, మాడబెట్టడం, నిత్యం ఉండేవి. దాన్నింకా యాతన పెడితే ఎందుకు పనికొస్తదని ఈ ఏర్పాటు చేశాడు. అందుకనే సభలో గూడా నాదీ మా చిన్నారావుదీ దేహాలు వేరుగాని మనసొకటే అనేవాడు గుంభనగా. ఇంత నమ్మకస్తుడు లక్ష వరాలు పోస్తే దొరుకుతాడా చెప్పు? అందుకనే ఎదటి గ్రూపు వాళ్ళకి చిన్నారావు మీద కన్ను.

"నిన్ను జూస్తే కడుపు తరుక్కు పోద్ది చిన్నారావు, ఎప్పుడూ ఇంతేనా, గొర్రెతో కలాగ? నీ బాగు నీకు దెలీపోతే నీ ఓనరు కేనా తెలీదా" అన్నాడు పంతులుగారు. చిన్నారావు ఆ మాటలు పూర్తయ్యేలోగా పారిపోయాడు యజమాని దగ్గిరికి.

ఇలా నాలుగైస్సార్లయాక ఓనాడు చిన్నారావు కన్ను కొద్దిగా తెరిచాడు.

"అసలు నువ్వోపాలి మా ఇంటికి రా. మనం కులాసాగా మాట్లాడుకుందాం. తొందర్లేదులే. నీ ఓనరుగారు దేశాంత్ర వెళ్తున్నారుగా. ఆయనెళ్ళాక తిరికైనప్పుడే రా", అన్నాడు పంతులుగారు.

వారం తరవాత రెడ్డిగారు రంగం వెళ్ళే వర్తకదళంతో కలిసి బయల్దేరారు.

చిన్నారావు దిగాలు పడిపోయాడు. అతనికి భయం పట్టుకుంది, పంతులుగా రా మాటన్నప్పట్నించీ. 'మీరెళ్ళొద్దు. లేపోతే నన్ను తీసికెళ్ళండి' అన్నాడు బిక్క మొహం బెట్టి. "భయమెందుకు నెల తిరిగేసరి కిక్కడకి వాల్నా? ఈలోపల నీ బుద్ధి గడ్డి తింటదన్న బయం తప్ప ఇహనెందుకూ బయపడక్కర్లేదు. నేను కట్టుదిట్టాలు చేసే పోతన్నాను" అన్నాడు రెడ్డిగారు. పొయ్యేవాడు సంతలో చక్కని చిలకమొస్తే కొని చిన్నారావు కిచ్చారు. దీ న్నట్టేబెట్టుకో అన్నారు. దీన్నట్టే బెట్టుకుంటాను అన్నాడు చిన్నారావు. రెడ్డిగారు ఫక్కున నవ్వి, బుజం తట్టి కారెక్కారు.

మర్నాడు మద్దినేళకల్లా కబురొచ్చింది. మాపిటికి కూడు దిన్నాక అటేపు షికార్రమ్మన్నారు పంతులారు అని. చిన్నారావు మనసు దిగులు పడిపోయింది. అద్దం జూసుకుంటే మొఖాన దొంగ వాలకం పడిపోయింది. ఛస్. వెళ్ళిచూదారనుకున్నాడు. ఛీ సామిద్రోహమా? అనుకున్నాడు. సామేటి నాకంటే, ఎవడికాడే సామి. అందుకే ద్రోహమేటనుకొన్నాడు. తెగించాడు. పెందలకాడే ఎంగిలిపడి, ముస్తాబై రెడ్డిగారి పాత కండవా తీసి బుజానేసి సావిట్లో కూర్చున్నాడు – వొర్షం పోగానే కదుల్దావని. వొర్షం పోయిందాకా ఊసుపోలేదు. ఉట్టిమీద చిలకని పలకరించాడు. ఉలుకొచ్చినట్టొరకుంది పలక్కుండా.

కాస్సేపాగి టైము జూసుకుని కండువా వేసుకుని, తాళం అందుకోబోయే వరకు.

"ఎందాకా" అంది చిలక. "అడిగావ్వా? నీ యమ్మ సిగదరగ" అని తిట్టి, అంతలోనే "నీకు మాటలొచ్చా" అంటూ ఆశ్చర్యపడ్డాడు.

"మా యమ్మ సిగ నువ్వేం దరుగుతావులే. అది పాషను కోసం అని ఎప్పుడో క్రాపింగు జేయించుకుంది. నీ సంగజ్జెప్పు. నువు జేస్తున్న పనేవన్నా బాగుందా" అంది చిలక.

"నా గొడవ నీకెందుకూ?"

"నాగ్గాపోతే ఎవరికీ? నువ్వు స్వామి ద్రోహం చెయ్యడానికింకా వేళకాలేదు. తొందరపడితే దెబ్బ తింటావు. నీకు సొంతంగా మాటాడ్డం రాదు. అబద్ధాలు బాగా చెప్పలేవు. అసలు కట్టాయిప్పా సామర్థ్యం లేనివాడివి. స్వామిద్రోహం ఎలా చేస్తావయ్యా? నీ మేలు కోరిచెప్పాను వెళ్ళకు" అంది చిలక.

చిన్నారావు తెల్లబోయి గుడ్లప్పగించి చూశాడు. 'నాకు దెలుసు. నువ్వు మా జాతివాడివే. నిన్ను చిలకల చిన్నారావంటారు గదూ?'

"ఏదో అంటారు నీకేల?" అన్నాడు చిన్నారావు.

చిలక నవ్వింది. "అవునుగాని చిన్నారావూ స్వామి ద్రోహం నీ అంతట నువ్వు జేస్తున్నావో, లేక నిన్నొదుల్చుకుందుకని నీకు దెలీకుండా మీ రెడ్డిగారే నీ చేతా పని చేయిస్తున్నాడో నీకు తెలుసా?" అంది.

చిన్నారావు గిరుక్కున వెనుదిరిగి ఆశ్చర్యంగా చూశాడు చిలక వంక.

"ఇది దొంగాట సుమా. అందరూ దొంగలే. కానీ, దొరికిపోయిన వాణ్ణే పాతేస్తారు. వాడి నెత్తి మీద కాలెట్టడానికి పట్టు కుదుర్తే తప్ప వీడినెత్తి కాళీ చెయ్యడం ఒంటికి మంచిది కాదు" అంది చిలక.

చిన్నారావు నీరసంగా కుర్చీలో కూలబడిపోయాడు.

"రాజకీయం అనేది ఒక కళ. అంతే తప్ప గుడ్డెద్దు చేలో పడ్డట్టు ఎగబడి తోసుకుపోవడం కాదు. పందికొక్కులా అదేపనిగా గోతులు తవ్వడంగాదు. ముందేం జరగబోతుంది అన్నది ఊహించటం రాజకీయం. జరగబోయేదాంతో మనకేం ఒరిగిపడుతుంది అన్నది అంచనా కట్టడం రాజకీయం. ఒరిగిపడేదుంటే మరి పదికాలాలు మనడానికి ప్రజల కోసం వదులుకోవలసిందే పాటి? మిగతా దాంట్లో కొరుకుడు పడేదెంత? మింగితే హరాయించుకునేదెంత? ఇవ్వన్నీ ఊహించి లెక్కకట్టి వ్యవహారం చెయ్యడం రాజకీయం. కప్పేలా ఒప్పేలా తప్పులు చెయ్యడం రాజకీయం. అంతేగాని పంతులు రమ్మన్నాడని పరుగెత్తడవదేం బుద్ధి?" అంది చిలక.

"నువ్వు లావుపాటి బుక్కురాసి అమ్ముకోరాదూ నా ప్రాణం దీకపోతే?" అన్నాడు చిన్నారావు చిరాగ్గా.

"దానికేం? నువ్వు నా మాట కాదని పరిగెత్తి బోల్తాపడు. పెద్ద ట్రాజిడీ రాస్తాను" అంది చిలక కిలకిల నవ్వి.

"స్వామిద్రోహీ" అన్నాడు చిన్నారావు ఉక్రోషంతో.

"నా సామి ఎవడో తేలందే స్వామిద్రోహిని ఎలా గవుతానయ్యా? నన్ను రెడ్డిగారు కొన్నాడు గాబట్టే ఆయనా కావచ్చు. కొని నీకిచ్చాడు గాబట్టే నువ్వు కావచ్చు. నింద పడినపుడు ఇట్టె స్వామిని ఫిరాయించగలను. తెలుసా?"

"ఇప్పుడు నన్నేం చెయ్యమంటావు చెప్పు."

"అనేదేవుంది? రెడ్డిగారొచ్చేదాకా గుమ్మం కదలకు. కదలదలిస్తే, నేనో మూడు కథల్చెబుతా విని జవాబిచ్చి మరీ వెళ్ళు. మొగసిరున్న వాడివైతే అలా చెయ్యి" అంటూనే చిన్నారావు వాలకం జూసి కథారంభించింది చిలక.

# దగాపడ్డ తమ్ముడి కథ

తమ్మిరాజుకీ కృష్ణమూర్తికీ పరిచయం అయినప్పుడు వాళ్ళ హోదాల్లో హస్తి మశకాంతరం ఉంది. తమ్మిరాజుకి సర్కారులో కల్పవృక్షం లాంటి ఇలాకాలో కామధేను వంటి ఉజ్జోగం, వెయ్యి రూపాయలు పోసి కొనిచ్చాడు మామగారు. కట్నం బదులిచ్చాడన్నమాట. జీతం డెబ్బై నాలుగే అవుగాక, అయితేనేం కామధేనువన్నాను గదా. అంచేత కాముకు లందరికీ దీనిమీదే గురి తమ్మిరాజు కది మంజూరు చేసిన ఆఫీసరు బదిలీ కాగానే ఆ సీటు మీదికి దాడి ఆరంభమైంది. అంతవరకూ లంచాలిచ్చి పన్లు చేయించాడు. బాగుపడ్డవాళ్ళు ఫిర్యాదులూ మహజర్లూ పెట్టగా, మరోవంక అది కావాలనుకున్నవారు పాట పై పాట పాడారు. బ్రహ్మాండమైన సిఫార్సులు తెప్పించారు. దానాదీనా వత్తిడి ఎక్కువై తమ్మిరాజుకి పై ఉద్యోగానికి ప్రమోషను ఇప్పించాలని నిశ్చయించారు పెద్దలు. ఈ మాటలు లోపాయికారీగా తెలీగానే, తమ్మిరాజు చాలా దూరం ఆలోచించి, తెగించి పెద్ద ఆఫీసరు కృష్ణమూర్తి ఇంటికి వెళ్ళి కాళ్ళమీద పడ్డాడు. పిల్లలవాణ్ణి కనికరించమన్నాడు, జబ్బు మనిషి నన్నాడు. చాలాసేపు మొత్తుకోళ్ళయ్యాక అసలు సంగతి చెప్పాడు.

"అదేవిటయ్యా? ప్రమోషనొస్తే నీకే మంచిది గాదా? జీతం బాగా పెరుగుతుంది. పని తగ్గుతుంది. రెస్టుగా ఉండవచ్చు. పెత్తనం చెయ్యచ్చు. నీకిదేం బుద్ధి" అన్నాడు ఆఫీసరు.

ఆయన కొత్తవాడు. కుర్రవాడు.

"చూడు బాబూ హోదాలో నాకు పై అధికారివయినా వయసులో నా బిడ్డలాంటి వాడివి. నాకు ప్రమోషను తప్పించు. నీ మేలు మర్చిపోను. నీ ఋణం ఉంచుకోను" అంటూ ఉన్న సంగతి విన్నవించాడు.

గోష్ఠి ముగిసేసరికి ఆఫీసరుగారికి తమ్మిరాజు ఆరోగ్యం ఏమీ బాగులేదనీ, ప్రమోషన్లకు అనర్హుడనీ కింది ఉద్యోగుల్ని బాధించి భయపెట్టలేడనీ, వట్టి అసమర్థుడనీ, దస్తూరీ, బట్టలు బాగుండవనీ నమ్మకం కుదిరింది....

ఆ ప్రకారం పైకి రాసేసి ప్రమోషను రద్దు చేయించారు. తమ్మిరాజు మిత్రునికి పార్టీ ఇచ్చాడు.

ఆనాటి నుంచి మూర్తిగారూ, తమ్మిరాజుగారూ పరమాప్తులయ్యారు. తమ్మయ్యగారూ అని పిలిచేవాడు మూర్తి ఎవరూ లేనప్పుడు. ఏం నన్నయ్యగారూ అనేవాడు తమ్మయ్య.

సౌభ్రాతృత్వంతోబాటు అన్నదమ్ములిద్దరూ కూడా వర్ధిల్లారి. మూర్తిగారు శతకోటి విద్యలూ నేర్చారు. తమ్మయ్య ఆయనకు నమ్మిన బంటు అయ్యాడు.

ఇలా ఉండగా కొన్నాళ్ళకి ఇనప్పెట్లో పేరుకున్న డబ్బుని ఎలా కరిగించి పబ్లీకున తెచ్చుకోవాలో తేలక, తెగించి ఉద్యోగం వదిలేందుకు దమ్ములల్లాలక మూర్తిగారు ఇబ్బంది పడసాగారు. అంతలో సర్కారు పన్లు భారీ ఎత్తువి కొన్ని తగిలాయి. సర్రాజు పెళ్ళిలో గుర్రాజుకో పోచన్నట్టు ఓ ముహూర్తం చూసి మూర్తిగారు దివ్యమైన భవనం నిర్మించడం ఆరంభించారు. ఎట్నించెటొస్తుందోనని కొంతకాలంపాటు అది తమ్మయ్య పేరిటే ఉంచాలని నిశ్చయించి అతన్దగ్గర లోపాయి కారిగా కాయితమ్ముక్క

రాయించుకుని పనులు సాగించారు. అనుకున్నదంతా అయింది. గిట్టనివాళ్ళెవరో సాహసించి పైకి ఫిర్యాదులు పంపారు. జిల్లా, తాలూకా పేపర్లలో నానా చెత్తా రాయించారు అవినీతి, ఇవినీతి అంటూ. దర్యాప్తులు జరిపి రాబడి, ఖర్చులు బేరీజు వేయిస్తారని మూర్తిగారికి లోపాయికారీగా తెలిసింది.

తమ్మయ్యకి కథంతా చెప్పి, గుట్టు రచ్చకెక్కకుండా అదుకోవాలన్నాడు. "లంచాలు నువ్వే తీసుకున్నట్టు ఒప్పుకొని దొరికిపో.... ఏ అయిదారు వేలో అను. కడుతున్న ఇల్లు నీ తమ్ముడి పేర మార్పించు. మహా అయితే నిన్ను బర్తరఫు చేస్తారు. ఆ వారకి నష్టం నేను భరిస్తాను" అన్నాడు.

"మీక్కష్టం వస్తే నాక్కాదా" అన్నాడు తమ్మాయి.

తీరా ఇంక్వైరీ వచ్చాక అది లాకాయి లూకాయిగా పోలేదు. డిపార్టుమెంటు సరుకుల బేరీజు, జరుగుతున్న పన్లు ఖర్చు మతలబులూ అన్నీ ఆరా తీశారు. తను తినలేదని నిరూపించుకోవాలంటే ఆ నష్టాలకూ లోపాలకూ సంజాయిషీ లివ్వక తప్పదు. ఇస్తే ఎవరికీ ఢోకాలేదు.

తనకిష్టం లేకపోయినా తప్పనిసరిగా తమ్మయ్యనీ అతగాడి భవిష్యత్తునీ త్యాగం చేసి అతని పేరిచ్చేశాడు మూర్తి. తమ్మయ్యకి ఖర్చు తడిసి మోపెడవడం కాకుండా ఖైదుకి కూడా వెళ్ళొచ్చాడు – స్వామి భక్తి కొద్దీ. బిల్డింగు ఎక్కడ దక్కడ ఆగిపోయింది. పదేళ్ళు తిరిగేదాకా మూర్తిగారు దాని మొహం కూడా చూడలేదు. అంతా మరచిపోయారను కున్నాక, తమ్మిరాజు తిరిగొచ్చాక, కృష్ణమూర్తి నెమ్మదిగా దాన్ని వశపరచుకొని ఇంకో నాలుగేళ్లకి పూర్తి చేయించాడు. ఏం బ్రహ్మాండమైన భవనం అని ప్రజా హృదయాన్ని ముగ్ధం చేసింది. కొందరు పౌరులు దానిని చూసి చిన్ననాటి ముచ్చట్లు తలచుకొని, "ఇందులో ఈ గది నాది" "ఈ కిటికీ నాకష్టార్జితం" "ఈ గడప నా వాటా" "ఈ చలవరాయి నా చందా" "ఈ తలుపులు నావి" అని సగర్వంగా చెప్పుకొని బాష్పాలు రాల్చేవారు. అవి ఆనందం బాషతువో కావో తెలియదనుకో. తమ్మిరాజు బాష్పాలు మాత్రం ఆనంద బాష్పాలు కావు. ఎందుకంటే మూర్తిగారు అతని మొహం చూడ్డం మానేశాడు. చిల్లికానీ పరిహారం కూడా ఇవ్వలేదు. "మనమిక మాటాడుకోవద్దు. మనం కలిస్తే మళ్ళీ పాత గొడవలు రేగుతాయి" అనేశాడు తమ్మయ్యతో.

"చిన్నారావూ! స్వామి భక్తి అలా ఉండాలి... నీకు ఉందా?" అంది చిలక కథ ముగించి.

"ఎందుకూ, నన్ను కూడా దగా తినమన్నావా? నువు చెప్పే కథ నీతిని తీసుకుంటే, నేనీపాటికే జాగర్త పడాల్సింది" అన్నాడు చిన్నారావు.

చిలక కంగారు నటించింది. "పొరబాటే. ఓ దానికో కథ చెప్పేశాను గామోసు" అంది సిగ్గుపడి.

☆ ☆ ☆

"సుబ్బరాజూ నువ్వు జెప్పు. మూర్తి అలా నమ్మిన బంటుని దగా జేశాడు గదా. తమ్మిరాజు ఎదుర్తిరిగి దెబ్బతీస్తే తప్పేముంది?" అన్నారు రెడ్డిగారు.

"ఏముంది? మళ్ళీ ఖైదు కెళ్తాడు. అసలు అధికార్ని నమ్మమనెవడు జెప్పాడు? 'క్షణక్షణముల్ ప్రభువుల దివ్య చిత్తముల్' అని మీరే అంటూ ఉంటారు. అంచేత దగా చేసిన మూర్తిగారిది తప్పుగాదు. ఆయన మాట మరీ అంత చేటు నమ్మిన తమ్మిరాజుదే తప్పంతా. అందుకే శిక్షననుభవించాడు."

"కోట్లకొద్దీ ప్రజలే దగాపడి, బాధలు అనుభవిస్తూంటే, తమ్మిరాజు ఒక్కడిదీ లెక్కేవిటి?" అన్నాడు సుబ్బరాజు.

రామిరెడ్డిగారు నవ్వి కథ కొనసాగించారు. "సరే, ఆ చిలక ఆ కథ చెప్పేవరకు రాత్రి బాగా పొద్దోయింది. రేపెళ్ళచ్చులే" అని చిన్నారావు ముస్తాబు విడిచేసి పడుకున్నాడు.

మరునాడు రాత్రి అతను భోంచేసి, తాంబూలం వేసుకొంటుండగా, 'అంతకింతేంది; ఇంతకెంత?' అంటూ చిలక జనాంతికంగా ఓ పాట అరంభించింది. అదేవిటి పాటన్నాడు చిన్నారావు.

"చెబుతా. విను" అంది చిలక.

★ ★ ★